ఆశవర్కర్లపై దాడి ముమ్మాటికీ ప్రభుత్వ దాడి

- ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

నర్సాపూర్, డిసెంబర్ 9: ఆశవర్కర్లపై జరిగిన పోలీసుల దాడి ముమ్మాటికీ ప్రభుత్వ దాడేనని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం ఆశవర్కర్లు తమ డిమాండ్లను నెరవేర్చాలని ధర్నా చేస్తున్న మహిళలపై పోలీసుల దౌర్జన్యంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. మహిళలని చూడకుండా దాడి చేసి, అక్రమంగా అరెస్ట్ చేయడంపై మండిపడ్డారు. మహిళలను కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆశవర్కర్ల డిమాండ్ నెరవేర్చడానికి వారికి మద్దతుగా ఉంటూ న్యాయం జరిగే వరకు పోరాడుతామని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

శివ్వంపేట, డిసెంబర్ 9: శివ్వంపేట మండలంలోని ఏదుల్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మర్రి మహేందర్‌రెడ్డి తండ్రి మర్రి ప్రతాప్‌రెడ్డి ఇటీవల అకాల మరణం చెందారు. సోమవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, నాయకులు జనార్దన్ ముదిరాజ్, పిట్ల భూపాల్, సుహాసినిరెడ్డి, వెంకట్‌రెడ్డి, పిట్ల భూపాల్, పిట్ల కుమార్, పైనం నర్సింలు, బేగరి యాదగిరి ఉన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరణ

- బోరు మోటర్లకు మరమ్మతులు

బ్రాహ్మణపల్లిలో నల్లాల ద్వారా వస్తున్న మిషన్ భగీరథ నీరు

నర్సాపూర్, డిసెంబర్ 9: బ్రాహ్మణపల్లి, నత్నాయిపల్లి గ్రామాల్లో నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన నీటి గోస తీరేదారేది? అనే కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు వెంటనే నీటి సమస్యను పరిష్కరించి, గ్రామాలకు నీటి సరఫరాను పునరుద్ధరించారు. నత్నాయిపల్లి గ్రామానికి సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీని గుర్తించి, సరిచేశారు. వాటర్ ట్యాంక్‌లోకి నీరు సరఫరా చేసే బోరు మోటర్‌కు మరమ్మతులు చేయించారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో మిషన్ భగీరథ వాల్వ్ లీకేజీని గుర్తించి పరిష్కరించారు. వాటర్ ట్యాంక్ బోర్ మోటర్‌కు మరమ్మతులు చేయించారు. గ్రామంలోని ఇంటింటికీ నీరు రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

నిరుద్యోగులకు దుకాణాలు కేటాయించాలని వినతి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): మెదక్ మున్సిపల్‌లో ఆక్రమణలకు గురైన దుకాణాలను నిరుద్యోగులకు కేటాయించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ దుకాణాలపై కమిషనర్, కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో 47 ఏండ్లుగా బినామీ వ్యాపారవేత్తలు అనుభవిస్తున్నారని ఆరోపించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు సంజీవులు, కిరణ్, నరేందర్, ప్రభాకర్, కృష్ణ, బాల్‌రాజ్, ప్రవీణ్, రవి, యాదగిరి ఉన్నారు.

ప్రభుత్వ మూర్ఖపు విధానానికి నిదర్శనం

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 9: తెలంగాణ తల్లికి ఎలాంటి ఆభరణాలు లేకుండా చెయ్యి గుర్తు వచ్చేలా రూపాన్ని మార్చడం దురదృష్టకరమని బీఆర్ఎస్ మెదక్ పట్టణ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యమ తల్లుల త్యాగాలను అవమానించేలా తెలంగాణ తల్లి రూపం చేయడం ప్రభుత్వ మూర్ఖపు విధానానికి నిదర్శనమన్నారు. ప్రతి మహిళకు రూ.2,500, వృద్ధులకు రూ.4వేల పింఛన్, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం, కల్యాణ లక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇవ్వడంపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

నందిగామ సీఏపై చర్యలు తీసుకోవాలి

రామాయంపేట సీఐ కార్యాలయం ఎదుట నందిగామ గ్రామస్తుల ఆందోళన

రామాయంపేట, డిసెంబర్ 9: నిజాంపేట మండలం నందిగామ గ్రామ సీఏ ప్రవీణపై చర్యలు చేపట్టాలని కోరుతూ మహిళా సంఘాల సభ్యులు సీఐ వెంకటరాజగౌడ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. సోమవారం నందిగామ నుంచి 8 మహిళా సంఘాల సభ్యురాళ్లు సీఏ ప్రవీణపై ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం సీఏగా పనిచేసిన ప్రవీణ మహిళా సంఘాలను మోసగించి రూ.కోటికి పైగానే టోకరా పెట్టి, ప్రస్తుతం పరారీలో ఉన్నదని ఆరోపించారు. తాము వెలుగు గ్రూపుల్లో తీసుకున్న రుణాల మొత్తం చెల్లించామని, సీఏ ప్రవీణ సొంతానికి వాడుకుని పత్తాలేకుండా పోయిందన్నారు. డీసీసీబీ నుంచి తమకు నోటీసులు పంపించారని సీఐ ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు.

నందిగామలో సివిల్ సప్లై దాడులు

నందిగామలో ఒక ఇంటిని సీజ్ చేస్తున్న సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

నిజాంపేట, డిసెంబర్ 9: మండలంలోని నందిగామలో స్టేట్ సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్వో ద్రోణాచార్యులు, సివిల్ సప్లై ఎమ్మార్వో ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామంలోని ఓ ఇంట్లో పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. సదరు వ్యక్తి ఇంటికీ తాళాలు వేసి ఊరికి వెళ్లడంతో ప్రస్తుతానికి ఆ ఇంటిని సీజ్ చేశామన్నారు. పీడీఎస్ బియ్యం తరలించినా, నిల్వ చేసినా ఆ వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రామాయంపేట, డిసెంబర్ 9: రామాయంపేటకు చెందిన రాజు అనారోగ్యంతో కార్పొరేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబానికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు రూ.22 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం అందజేశారు.

అధికారులు సమయపాలన పాటించాలి

మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్ మున్సిపాలిటీ: అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

రామాయంపేట తహసీల్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రజనీకుమారి

- ప్రజావాణిలో 53 దరఖాస్తులు
- అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ప్రతి సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి వివిధ శాఖల అధికారులు సమయపాలనకు ప్రాధాన్యతనివ్వడం లేదని అదనపు కలెక్టర్ నగేశ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో డీఆర్‌వో భుజంగరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు సంబంధిత ఇతర శాఖల అధికారులతో కలిసి వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చిన వినతులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో 53 దరఖాస్తులు స్వీకరించామన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు చేరవేసేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు. అధికారులందరూ ప్రజావాణి రోజున 10.15 నిమిషాలకల్లా హాజరై, అటెండెన్స్‌లో సంతకం పెట్టాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు-6, ధరణి- 23, పింఛన్లు-2, ఇతర సమస్యలు-22 మొత్తం 53 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి

కలెక్టరేట్ వద్ద ఆర్టీసీ బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని రామాయంపేటకు చెందిన చంద్రప్రతాప్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం కలెక్టర్ కార్యాలయానికి రాకపోకలు సాగిస్తున్నారని, ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీ

మెదక్ అర్బన్, డిసెంబర్ 9: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

రామాయంపేట, డిసెంబర్ 9: సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి ఉందని తహసీల్దార్ రజనీకుమారి తెలిపారు. తహసీల్ కార్యాలయంలో అర్జీలు స్వీకరించారు.

గ్రామాలు అభివృద్ధి చేస్తే నిధులివ్వరా?

చిన్నశంకరంపేట: అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్టు చేసి వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో మండలంలోని మాజీ సర్పంచులు

- మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టులు
- పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల డిమాండ్

రామాయంపేట, డిసెంబర్ 9: గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేస్తే తమకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వడంలో జాప్యం చేయడం సరికాదని సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు భూమగారి పర్సాగౌడ్ అన్నారు. సోమవారం మండల మాజీ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ తరలివెళ్తుండగా పోలీసులు ముందస్తుగా వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు నర్సాగౌడ్ మాట్లాడారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, డిసెంబర్ 9: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన చలో హైదరాబాద్‌కు వెళ్లకుండా పోలీసులు ఆదివారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డితో పాటు పలువురు సర్పంచ్‌లను వారి ఇండ్ల వద్ద అరెస్టు చేశారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తాము అప్పులు చేసి చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించకుండా సంబురాలు చేయడం ఎంతవరకు సమంజసమని, ప్రభుత్వం వెంటనే స్పందించి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మెదక్ మండలంలో..

మెదక్‌రూరల్, డిసెంబర్ 9: మెదక్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులను మెదక్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో సెక్రటేరియట్ కార్యక్రమం ఉన్నందున్న మాజీ సర్పంచులను హైదరాబాద్‌కు వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేశారు. వీరిలో సిద్దగౌడ్, నర్సింలు, ఎలక్షన్‌రెడ్డి, మోహన్ నాయక్ తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్న శంకరం పేట, డిసెంబర్ 9: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో సెక్రటేరియట్ కార్యక్రమం ఉన్నందున్న మండలంలోని మాజీ సర్పంచులు హైదరాబాద్‌కు వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో మండల పోరం మాజీ అధ్యక్షులు పూలపల్లి యాదగిరి యాదవ్, జ్యోతి ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి ,నరేష్, సుధాకర్ ఉన్నారు. అనంతరం మాజీ సర్పంచులకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతి పత్రం అందజేశారు.

నేడు దివ్యాంగుల సమస్యలపై ప్రజావాణి

- జిల్లా గ్రామీణ అభివృద్ధి, సంక్షేమ శాఖ సమన్వయంతో సమస్యల పరిష్కారం: కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని దివ్యాంగుల కోసం ప్రతినెలా రెండో మంగళవారం ప్రత్యేక ప్రజావాణి ఏర్పాటు చేసి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రకటనలో తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణిపై ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా రెండో మంగళవారం 10.30 నుంచి 1.30 గంటల వరకు దివ్యాంగుల ప్రజావాణిలో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. కలెక్టర్ అధికారులతో సంప్రదించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గ్రామీణ అభివృద్ధి, జిల్లా స్త్రీ శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రేపు కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి ఉంటుందన్నారు.

గ్రూప్-2 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో 5,855 మంది పరీక్ష రాయనున్న అభ్యర్థులు

మెదక్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పరిధిలో గ్రూప్ -2 పరీక్షల నిర్వహణకు సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెదక్-11, నర్సాపూర్-03, తూప్రాన్-02 సెంటర్స్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 5,855 అభ్యర్థులున్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవో యూనస్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చేగుంట, డిసెంబర్ 9: పొలం పనులకు వెళ్తున్న దంపతులకు కారు ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్తకు తీవ్ర గాయాలైన ఘటన నార్సింగి మండల కేంద్రంలో సోమవారం జరిగింది. నార్సింగి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి మండల కేంద్రానికి చెందిన వట్టెపు లక్ష్మి(40) తన భర్త నాగరాజుతో కలిసి గ్రామ శివారులోని పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తున్నారు. హైదరాబాద్ వైపు నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలైన నాగరాజును చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. నార్సింగి తహసీల్దార్ షేక్ కరీం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని రామాయంపేట ప్రభుత్వ దవఖానకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఎస్ఐ హైమద్ అహ్మద్‌మోయినోద్దీన్ తెలిపారు.

ప్రమాదానికి కారణమైన కారు, మృతిచెందిన లక్ష్మి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నర్సాపూర్, డిసెంబర్ 9: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దచింతకుంట గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లాకు చెందిన బింగి శ్రీకాంత్(30) ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం తన స్నేహితులతో కలిసి కారులో వనపర్తి నుంచి మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గమ్మ దర్శనానికి వెళ్లి, ముగించుకుని రాత్రి 8 గంటలకు ఇంటికి బయలుదేరారు. నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట గ్రామ సమీపంలోని జలహనుమాన్ ఆలయ సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి మెదక్ వైపు వస్తున్న ఏపీ28 బీపీ3278 నెంబర్ గల ఇన్నోవా శ్రీకాంత్ ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బింగి శ్రీకాంత్ అక్కడిక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్నేహితులకు గాయాలయ్యాయి. మృతుడి భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

శివ్వంపేటలో మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

శివ్వంపేట, డిసెంబర్ 9: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల కోసం చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించ తలపెట్టిన మాజీ సర్పంచ్‌లను ఎస్సై మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో పత్రాల శ్రీనివాస్ గౌడ్, బాలమణి నరేందర్, చంద్రకళ శ్రీశైలం యాదవ్, అశోక్‌రెడ్డి ఉన్నారు.

సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు

కౌడిపల్లి, డిసెంబర్ 9: కౌడిపల్లి మండలంలోని తునికి మహాత్మా జ్యోతీబాపూలే పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీలను ఈనెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు www.cmcup.telangana.gov.in వెబ్‌పోర్టల్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి సీఎం కప్

పాపన్నపేట, డిసెంబర్ 9: ఈ నెల 10 నుంచి 12 వరకు పాపన్నపేట జడ్పీహెచ్ఎస్‌లో మండల స్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహించున్నట్లు ఎంపీడీవో విష్ణువర్ధన్ తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో, యోగా, అథ్లెటిక్స్ నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 6281350097, 9010735121 లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్టు

పాపన్నపేట, డిసెంబర్ 9: విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరి పెంపొందించడానికే జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు తెలంగాణ బయోసైన్స్ ఫోరం మండల అధ్యక్షుడు బెజుగం వేణుగోపాల్ తెలిపారు. సోమవారం పాపన్నపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు బయోసైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ఇద్దరిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. హెచ్ఎం మహేశ్వర్, ఉపాధ్యాయులు నసీరుద్దీన్, కరుణాకర్‌నాయుడు, శివశంకర్, శ్రవణ్ కుమార్, ఇందిరా ఉన్నారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, డిసెంబర్ 9: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జీవశాస్త్రంపై మండల స్థాయి టాలెంట్‌టెస్టును సోమవారం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో యాదగిరి బహుమతులు అందజేశారు. ప్రతి విద్యార్థి జీవశాస్త్రం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యం, జీవన విధానం, సుస్థిర అభివృద్ధి పర్యావరణ స్పృహపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో తెలిపారు.

మధ్యాహ్న భోజన సామగ్రి అందజేత

నర్సాపూర్, నవంబర్ 9: బ్రాహ్మణపల్లిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన దివంగత జీవన్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మధ్యాహ్న భోజన సామగ్రిని సోమవారం అందజేశారు. ప్లేట్లు, గ్లాసులు, టీ కప్పులు, స్ఫూన్లు పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి తగిన సాయం చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, గ్రామ కార్యదర్శి తారాసింగ్, ఏఏపీసీ చైర్‌పర్సన్ లావణ్య, సత్య నారాయణ, యాదగిరి రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మెదక్ అర్బన్, డిసెంబర్ 9: నేడు మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిఎం సురేఖ సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు 7842651592 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పన్నులు తగ్గించాలని వినతి

రామాయంపేట, డిసెంబర్ 9: మున్సిపల్ ట్యాక్సులను వెంటనే తగ్గించాలని పట్టణంలోని ఒకటో వార్డు ఎస్సీ కాలనీవాసులు కోరారు. సోమవారం ఎస్సీ కాలనీకి చెందిన బైరకుమార నేతృత్వంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో వారు అర్జీ పెట్టుకున్నారు. 1980లో నిర్మించిన ఇండ్లు శిథిలావస్థకు చేరుకున్నా అధికారులు ట్యాక్సులు పెంచి కూలిపోయిన ఇండ్లకూ ట్యాక్సులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పదో తరగతి మూల్యంకణ కేంద్రం ఏర్పాటు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 9: మెదక్‌లో పదో తరగతి మూల్యంకణ కేంద్రం ఏర్పాటు చేయాలంటూ సోమవారం డీఈవో రాధాకిషన్‌కు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ వినతిపత్రం అందజేశారు.

కుర్తివాడ జడ్పీహెచ్ఎస్‌లో మాక్ పోలింగ్

కుర్తివాడ స్కూల్‌లో మాక్ పోలింగ్

పాపన్నపేట, డిసెంబర్ 9: మండలంలోని కుర్తివాడ జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారిగా, పోలింగ్ అధికారులుగా, ఓటర్లుగా విద్యార్థులు విధులు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడుపాయల ఆలయానికి రూ.1.15 లక్షల ఆదాయం

పాపన్నపేట, డిసెంబర్ 9: ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి టెండర్ల ద్వారా రూ.1.15 లక్షల ఆదాయం వచ్చింది. సోమవారం ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలో చెప్పు స్టాండ్ నిర్వహణకు మెదక్‌కు చెందిన అరవింద్ రూ.1.15 లక్షలకు పాట పాడి దక్కించుకున్నాడు. కొబ్బరికాయల అమ్మకం, ఒడిబియ్యం పోగు చేసుకునేందుకు ఆలయం వద్ద పూజా సామగ్రి విక్రయించుకునేందుకు వేలం వేయగా పాల్గొనే వారు లేక వాయిదా వేశారు. ఈ టెండర్లను త్వరలో నిర్వహిస్తామన్నారు. ఆలయ సిబ్బంది సూర్యశ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్యాం పాల్గొన్నారు.

గుర్తుపట్టని స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం

రేగోడ్, డిసెంబర్ 9: గుర్తుపట్టని స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రేగోడ్ ఎస్సై పోచయ్య సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జగిర్యాల గ్రామానికి చెందిన బేగరి నాగయ్య(69) మతిస్థిమితం లేక గతనెల 22న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. బంధువుల వద్ద, ఎక్కడా వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఈనెల 6న మృతుడి కుమారుడు రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొండాపూర్ శివారులో కుళ్లిన స్థితిలో ఆయన మృతదేహాన్ని గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏపీజీవీబీ అటెండర్‌కు సన్మానం

చిలిపిచెడ్, డిసెంబర్ 9: చిట్కుల్ ఏపీజీవీబీలో 22 ఏండ్లుగా అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌రాముకు గత నెలలో పర్మినెంట్ అయ్యింది. ఉద్యోగోన్నతిపై నర్సాపూర్‌కు బదిలీ అయ్యారు. ఆయనకు బీఎం చాంపాలాల్, సతీశ్, బీరప్ప, విఠల్‌రెడ్డి సోమవారం సన్మానించారు.

LOST OF PASSPORT
I, MAMIDALA SAI KRISHNA, S/o. Mamidala Yadagiri, R/o. Flat